## క్లుప్తంగా

### నేడు దుర్గమాంబ పండగ


దుర్గమాంబ అమ్మవారు

పరవాడ: పరవాడ గ్రామంలో వెలసిన దుర్గమాంబ గ్రామ దేవత పండగను గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. గ్రామస్తులు దుర్గమాంబను దర్శించుకొని భక్తులు పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తారు. సాయంత్రం 3 గంటల నుంచి అమ్మవారిని భక్తుల దర్శనార్థం పురవీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం డప్పు వాయిద్యాలు, డ్యాన్సులు, చిడతలు, కోలాటాలు, సాముగరిడీలు, భారీ బాణ సంచాకాల్పుల మధ్య అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు చెప్పారు.

### ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం


పలు రకాల కథల పుస్తకాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. గ్రంథాలయ అధికారి శిరీష ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన శిబిరంలో విద్యార్థులకు పుస్తక ప్రదర్శన,కథలు చెప్పారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ శిరీష మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని మరింత పెంచుకోవాలని సూచించారు.

### కల్యాణం .. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

### ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు


విత్తన గొడౌన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐలు కోటేశ్వరరావు, లక్ష్మోజీ

పరవాడ: మండల కేంద్రమైన పరవాడలోని మూడు విత్తన గొడౌన్లలో విజిలెన్స్ అధికారులు బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సీఐలు కోటేశ్వరరావు, లక్ష్మోజీ విత్తన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యవసాయశాఖకు సమర్పించిన రికార్డులకు అనుగుణంగానే విత్తనాలు నిల్వ చేశారని గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా డీలర్లు వ్యవహరించలేదని గుర్తించామని సీఐలు కోటేశ్వరరావు, లక్ష్మోజీ చెప్పారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్, స్థానిక వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి పాల్గొన్నారు.

### నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.



# ఆవిష్కరణల వేడుక.. ఆధ్యాత్మిక వీచిక

తుంగ్లాం గ్రామంలో ముగ్గురమ్మలు కొలువుదీరిన శుభ ముహూర్తాన ఆధ్యాత్మిక పరిమళాలు భక్తులను తన్మయులను చేశాయి. స్వామీజీకి స్వాగతం పలికేందుకు తరలివచ్చిన భక్తజనసందోహంతో రహదారులన్నీ కిక్కిరిశాయి. షీలానగర్‌లో కలియుగ దైవం తిరుమల బాలాజీ విగ్రహావిష్కరణతో భక్తి సమీరాలు పలకరించాయి. కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాలిగోపురం ప్రతిష్ఠ, మాతృశ్రీ నగర్‌లో సాయినాథుడి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలతో భక్తుల ఉత్సాహం మరింత ఇనుమడించింది. ఆవిష్కరణ వేడుకల నేపథ్యంలో ఏకాదశి పర్వదినాన గాజువాక నియోజకవర్గం బుధవారం పండగ శోభను సంతరించుకుంది.


తుంగ్లాంలో ప్రతిష్ఠించిన కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల విగ్రహాలు


కుంచాలమ్మ అమ్మవారి సన్నిధిలో సిద్ధేశ్వరానంద భారతి, రమ్యానంద భారతీ స్వామి


స్వామీజీ, మాతాజీలకు స్వాగతం పలికేందుకు ర్యాలీగా తరలి వెళ్తున్న తుంగ్లాం గ్రామస్తులు


ప్రతిష్ఠించనున్న సాయినాథుడికి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న సుబ్బారావు దంపతులు

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. విశాఖ శ్రీ లలితా పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతి, శ్రీ శక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి మాతాజీ శ్రీ రమ్యానంద భారతి నూతన ఆలయాల్లో అమ్మవార్ల విగ్రహాలను ఆవిష్కరించారు. ముందుగా శ్రీ సిద్ధేశ్వరానంద భారతి, శ్రీ రమ్యానంద భారతిలను ఆలయాల వద్దకు తోడ్కొని రావటానికి తుంగ్లాం గ్రామకమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డితో కలిసి షీలానగర్ అయ్యప్ప స్వామి ఆలయం వద్దకు చేరుకుని భారీ స్వాగతం పలికి, ఆలయాల వద్దకు తీసుకువచ్చారు. అనంతరం కుంచాలమ్మ వారి ఆలయంలో పూజలు చేసిన స్వామీజీ, మాతాజీ అమ్మవారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం దుర్గాలమ్మ, ముత్యాలమ్మ వార్ల ఆలయానికి చేరుకుని అమ్మవార్ల విగ్రహాలను ఆవిష్కరించారు. ఆలయాల వద్ద హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన భారీ అన్నసమారాధనలో 20 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

**ఘనంగా సాయినాథుడి విగ్రహ ప్రతిష్ఠ**

కూర్మన్నపాలెం: 86వ వార్డు మాతృశ్రీనగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి దత్తాత్రేయ సహిత షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇరగవరపు వెంకట శ్రీధర్ స్వామి, వారి శిష్య బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపనోత్సవాలు జరిగాయి. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి, 86వ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు, దమయంతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

**శాస్త్రోక్తంగా గాలి గోపురం ప్రతిష్ఠ**

పెదగంట్యాడ: హౌసింగ్ బోర్డు సమీపంలోని కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గాలి గోపురాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, శ్రీధర్ స్వామీజీ బుధవారం ప్రారంభించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు, సాయంత్రం పరస ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైర్మన్లు ముమ్మిడి శెట్టి ముత్యాలశెట్టి, త్రిమూర్తులు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


గాలి గోపురం వద్ద రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, శ్రీధర్ స్వామిజీ

## వైభవంగా తిరుమల బాలాజీ దివ్యక్షేత్ర ప్రతిష్ఠ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్‌టీబీఎల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుమల బాలాజీ మందిరంలో బాలాజీ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. విశేష పూజలు, హోమాలు, చక్రస్నానాలు భక్తిశ్రద్ధలతో జరిపించారు. వేకువజాము నుంచే ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, కుంభారాధనం, ఉక్త హోమాలు చేశారు. సుముహూర్తమున యంత్ర రత్న ధాతున్యాసనములు, బింబ ధ్వజ స్తంభ స్థాపనము, వాస్తు హోమం, మహా పూర్ణాహుతి, కళావాహనము, విశేషారాధనలు శాస్త్రోక్తంగా జరిపించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. శ్రీ బాలాజీ విగ్రహాన్ని ఎస్‌టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. బాలాజీ మాలధారణ చేపట్టిన ఎస్‌టీబీఎల్ ఉద్యోగులు, సిబ్బంది పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


దివ్యక్షేత్రంలో ఆవిష్కరించిన తిరుమల బాలాజీ విగ్రహం

## కిక్కిరిసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బుధవారం కిక్కిరిసింది. జూన్ 1వ తేదీ నుంచి భూముల రేట్లు పెరుగుతున్నాయన్నా సమాచారంతో రిజిస్ట్రేషన్ పనులకు విచ్చేసిన వారితో కార్యాలయం నిండిపోయింది. దీనికి తోడు రెండు రోజులుగా సర్వర్ డౌన్ అవ్వడంతో రిజిస్ట్రేషన్ పనులు చాలా నిలిచిపోయాయి. బుధవారం పనులు మాన్యువల్‌గా నిర్వహించినట్లు సమాచారం.


గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిరీక్షిస్తున్న ప్రజలు

## మంచినీటి బోరు ఏర్పాటు


మంచినీటి బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న తుంపాల అప్పారావు తదితరులు

సబ్బవరం: సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు ఆదిరెడ్డిపాలెం గ్రామ దేవత పరదేశిమాంబ అమ్మ వారి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో బుధవారం మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. ఎంపీపీ నిధులతో ఏర్పాటు చేసిన బోరు బావి పనులను జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు , ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు,మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, శరగడం రాము,బోను గంగునాయుడు,నేబర్తి శ్రీను, కొటాన అప్పారావు, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు పాల్గొన్నారు.

## గిరిజన మహిళ హత్యకు కారకులను శిక్షించాలి

ఉక్కునగరం: ఇటీవల జరిగిన గిరిజన మహిళ హత్యకు కారకుడైన శ్రీనివాసకుమార్‌పై కఠిన చర్యలు చేపట్టాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గిరిజన మహిళ హత్యకు నిరసనగా ఉక్కు టీటీసీ కూడలి వద్ద బుధవారం నిర్వహించిన ధర్నాలో నాయకులు మాట్లాడారు. నిందితుడిపై కఠిన చర్యలు చేపట్టడం ద్వారా మరొక మహిళకు ఇలా జరగకుండా గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బయ్యే మల్లయ్య, బి.తాడన్న, సత్యం నాయుడు, ఎస్. సత్యనారాయణ, కొమ్ము ప్రసాదరావు, ఎస్. మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ఉక్కు టీటీసీ కూడలి వద్ద ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు

## ఉక్కు కర్మాగార పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కూర్మన్నపాలెం: వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, లక్షల మంది ప్రజలకు పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 839వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కు కోసం ప్రత్యేకంగా చర్చించాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

## జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతానికి సహకారం

ఆరిలోవ : జపాన్‌కు చెందిన తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పి.ఎం.బాలాజీ బుధవారం ఏయూను సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వారు సమావేశ మందిరంలో భేటీ అయ్యారు. ఏయూలో నిర్వహిస్తున్న జపనీస్ లాంగ్వేజ్ కోర్సుల గురించి చర్చించారు. ఈ కోర్సులు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా తగిన సహకారం అందించాలని రిజిస్ట్రార్ ఈ సందర్భంగా తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలాజీని కోరారు. ఈ మేరకు స్పందించిన బాలాజీ మాట్లాడుతూ జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతం చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జపనీస్ ఇన్ఫర్మేషన్ అండ్ స్టడీ సెంటర్ డైరెక్టర్, ఫారిన్, లింగ్విస్టిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, నన్నయ వర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య ఎం.జగన్నాథ రావు పాల్గొన్నారు.


తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలాజీకి పుష్పగుచ్ఛం ఇచ్చి గౌరవిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

# పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా
- ముగిసిన స్వచ్ఛత పక్వాడా

పరవాడ: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యవంతంగా జీవించగలమని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు.సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఈ నెల 16న ప్రారంభించిన స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం బుధవారంతో ఘనంగా ముగిసింది. ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, దీపికా లేడీస్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, కాంట్రాక్టు కార్మికులు, సింహాద్రి ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు ఉత్సాహంగా పాల్గొని ప్రాజెక్టు పరిసరాలు, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలను శుభ్రం చేశారు. సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ కార్యాలయంతో పాటు పరిసరాల శుభ్రత బాధ్యతగా బావించాలని సూచించారు. దీని ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుందని చెప్పారు. బాలిక సాధికారిత మిషన్-2023లో భాగంగా బాలికల కోసం వివిధ పోటీలు నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి పరిశుభ్రతపై వీధి నాటకాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. జీజీఎం సిన్హా వాడచీపురుపల్లి పరిసర గ్రామాల ప్రజలకు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. దీపాంజలినగర్ దుకాణ సముదాయంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు.


తిక్కవానిపాలెం తీరంలో చెత్త సేకరిస్తున్న సింహాద్రి జీజీఎం సిన్హా, ఉద్యోగులు

## కెమికల్ ఇంజినీరింగ్ వర్క్‌షాప్

ఆరిలోవ: ఆంధ్రా యూనివర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ సమత, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, ప్రొఫెసర్ ఎస్.వి.నాయుడు, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ-మొబిలిటీ, మోడలింగ్ అండ్ కంట్రోల్ ఆఫ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఆర్.పద్మశ్రీ, సైంటిస్ట్ శ్రీనివాస్‌కుమార్, ప్రొఫెసర్ శేషగిరిరావు, ప్రొఫెసర్ ఎం.వి.వి.చందన లక్ష్మి పాల్గొన్నారు.


వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న ఏయూ ఆచార్యులు

## రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

సబ్బవరం: మండలంలోని అమృతపురం శివారు సూరెడ్డిపాలెం గ్రామంలో రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం శంకుస్థాపన చేసారు. ఆలయాన్ని సుమారు రూ.50 లక్షల అంచనా నిధులతో నిర్మించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, సర్పంచ్ బైలపూడి గౌరీ,ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు బైలపూడి రామారావుతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

## పొగాకు వినియోగంతో ఆరోగ్యానికి చేటు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ, హెల్పేజ్ ఇండియా సంయుక్తంగా బుధవారం నాయుడుపాలెం శివారు హస్తినాపురంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్పేజ్ ఇండియా ప్రతినిధి కె.వెంకటరావు మాట్లాడుతూ నేటి సమాజంలో యువతీ యువకులు ఆరోగ్యాన్ని ఏ విధంగా కాపాడుకోవాలో అవగాహన కల్పించారు. సిగరెట్, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. చుట్ట, బీడీ సిగరెట్ల వినియోగం ద్వారా క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి చెంది అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. మత్తు పదార్థాల వల్ల అనేక కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని అందువల్ల వాటికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని వెంకటరావు సూచించారు.


పొగాకు అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న వెంకటరావు

## కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలి

**సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు**

ఉక్కునగరం: దేశ పాలకులు అనుసరిస్తున్న విధానాల మూలంగా లబ్ధి పొందే కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవడం కార్మికుల కర్తవ్యమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉక్కునగరం సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన × కార్మిక ఉద్యమం-నూతన పరిస్థితులు₹ సదస్సులో ఆయన మాట్లాడారు. సీఐటీయూ లక్ష్యం కార్మికులను, సంఘాలను ఏకం చేసి, ఐక్య ఉద్యమాలతో ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడమన్నారు. నియంతృత్వ నాయకుల కారణంగా వ్యవస్థలు గాడి తప్పుతున్నాయన్నారు. అమిత అధికార దాహం కలిగిన నాయకుల చేతి నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సి ఉందన్నారు. స్టీల్ సీఐటీయూ నాయకులు జె. అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి, అధ్యక్షుడు వై.టి.దాస్ ప్రసంగించిన కార్యక్రమంలో కె.ఎం.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

## రైతు బజార్లలో వసతులు కల్పిస్తాం

**సీఈవో నందకిశోర్**

గోపాలపట్నం: రైతు బజార్లలో మౌలిక వసతులు కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు బజార్ల ముఖ్యకార్యనిర్వాహక అధికారి ఎం. నందకిశోర్ తెలిపారు. ఆయన బుధవారం రాత్రి గోపాలపట్నం రైతు బజారులో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇక్కడి పరిస్థితులు.. రైతు ఇబ్బందులు గురించి ఆరా తీశారు. రెండో పూట బజారు జరుగుతున్న సమయంలో లైటింగ్ లేక ఇబ్బందులు పడుతున్నట్టు గుర్తించారు. లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆయనతో పాటు జిల్లా వ్యవసాయ మార్కెట్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ ఎర్రన్న, అసిస్టెంట్ డైరెక్టర్ షేక్ యాసిన్, గోపాలపట్నం రైతు బజారు ఈవో నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.


గోపాలపట్నం రైతు బజారులో రైతులతో మాట్లాడుతున్న సీఈవో నందకిశోర్

## ముగిసిన కృష్ణాలయం ప్రతిష్ఠ మహోత్సవాలు


పూజలు చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం తోటగరువులో శ్రీకృష్ణాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. తోటగరువులో నిర్మించిన ఈ ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు గత నెల 28 నుంచి కొనసాగుతున్నాయి. అప్పటి నుంచి పలు పూజా కార్యక్రమాలు చేపట్టిన ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం హోమం, విగ్రహాల ప్రతిష్ఠించే కార్యక్రమాలతో ముగించారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, శాసనమండలి సభ్యుడు యనమల రామకృష్ణుడు, స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఆలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ కమిటీ పెద్దలు ఒమ్మి చిన్నారావు, ఒమ్మి సన్యాసిరావు, తదితర సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. అతిథుల పేరిట అర్చకులు శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, తదితరులు ఉత్సవంలో పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.